క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇండియన్ హ్యూమన్‌రైట్స్ నగర కమిటీ ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి

తిరుపతి కల్చరల్: ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ కరప్షన్ సెల్ తిరుపతి నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈమేరకు ఆదివారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా కేకే రమేష్, జి.శంకర్, పి.మధుసూదన్, సహాయ కార్యదర్శిగా శివకృష్ణ నియమితులయ్యారు. వీరికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటి పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



బీజేపీ ఎంపీ లక్ష్మణ్

తిరుమల: భారతీయ జనతా పార్టీ ఎంపీ లక్ష్మణ్ ఆది వారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్ర రాయల్



తిరుపతి కల్చరల్: జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన సుంకర రాజేంద్ర రాయల్‌ను నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.మురళీకృష్ణ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సమగ్రంగా నిర్వహిస్తూ కాపు సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రాజేంద్ర రాయల్ తెలిపారు.

'సూర్య'లో ఘనంగా వార్షికోత్సవం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యప్రకాష్

తిరుపతి కల్చరల్: పట్టణంలోని రెడ్డిరెడ్డి కాలనీలోని సూర్య హాస్పిటల్‌లో 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, స్నేహితులు హాస్పిటల్ అధినేత డాక్టర్ సూర్య ప్రకాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ ప్రారంభం నుంచి ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులపై అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. రాయలసీమలోనే మొదటిసారిగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను కనుక్కొనే »ఈబీయూఎస్« పద్ధతిని అతి తక్కువ ఖర్చుతో చేయడం జరిగిందన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి సమీపంలో శనివారం మధ్యాహ్నం చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న పాల ట్యాంకర్ వాహనం, సుమారు 62 ఏళ్ల ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఢీకొంది. తలకు తీవ్ర గాయం కావడంతో హుటాహుటిన తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, ఆచూకీ తెలిసిన వారు 94407 96760, 94409 00720 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఈవీ..ఈజీ

ప్రస్తుతం టెక్నాలజీకి అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. జీవితకాలం పన్ను మినహాయింపుతో పాటు వాతావరణానికి ఎలాంటి నష్టం కలిగించవు. అందుకే భవిష్యత్‌లో కూడా మరిన్ని వాహనాలు వినియోగంలోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ వాహనాలతో ఢిల్లీలాంటి మహానగరం ఎంత కలుషితం అవుతుందో మనం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది.

- సైలెంట్‌గా దూసుకుపోతున్న ఎలక్ట్రిక్ వాహనాలు
- తిరుపతి జిల్లాలో 6,494 వాహనాల వినియోగం
- పలు ప్రైవేట్ సంస్థలు, హోటళ్ల వద్ద అందుబాటులో చార్జింగ్‌కు వెసులుబాటు
- ఇటీవలే తిరుపతి ఎయిర్‌పోర్టులో చార్జింగ్ యూనిట్ ఏర్పాటు
- సులువుగా తోలేందుకు అవకాశం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న జనం
- చార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెరిగితే మరిన్ని రోడ్డుపైకి వచ్చే అవకాశం
- జీవితకాలం పన్ను మినహాయింపు
- సిటీ జనం చూపు ఈవీల వైపు

తిరుపతి మంగళం : ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) సైలెంట్‌గా దూసుకెళుతున్నాయి. తిరుపతి జిల్లా వాసులు ఈవీలపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ఈ వాహనాలపై జీవితకాలం పన్ను మినహాయించడంతో ప్రస్తుతం ప్రతిరోజు వందకు పైగా ద్విచక్ర వాహనాలు అమ్ముడుపోతున్నాయి.



ఆటో రిక్షాలు, ఇతర వాహనాల వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది. కార్ల అమ్మకాలు మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు అవసరమైన మేరకు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. ఈవీలపై పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల వివిధ శ్రేణులకు చెందిన కార్లపై కనిష్టంగా రూ.50 వేలు నుంచి గరిష్టంగా రూ.లక్షల్లో జీవితకాలం పన్ను రద్దయ్యే అవకాశం ఉంది. ఇలా కార్లపై రూ.లక్షల్లో రాయితీ లభిస్తున్నప్పటికీ విద్యుత్ చార్జింగ్ కొరత కారణంగా అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవని ఆటోమొబైల్స్ డీలర్లు చెబుతున్నారు.

ప్రతి 3 కి.మీ.కు ఒకటి అవసరం..

ప్రస్తుతం తిరుపతి జిల్లా పరిధిలో సుమారు వంద లోపే చార్జింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులకు బస్టాండ్‌లోనే చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిగతావన్నీ ప్రైవేటు వ్యక్తులు, సంస్థల నిర్వహణలో ఉన్నాయి. హోటళ్లు, షాపింగ్ కేంద్రాలు, మాల్స్ తదితర చోట్ల చార్జింగ్ సదుపాయం ఉంది. ఆర్టీసీ డిపోల్లో చార్జింగ్ సదుపాయం ఉన్నా ప్రస్తుతం బస్సుల వినియోగానికి అది పరిమితం. సాధారణ వాహనదారులు వినియోగించేందుకు అవకాశం లేదు. అయితే ఇటీవల తిరుపతి ఎయిర్‌పోర్టులో వాహనాల పార్కింగ్ వద్ద కూడా చార్జింగ్ యూనిట్లను ఒకే చోట ఏర్పాటు చేశారు. అలాంటివి జిల్లాలో వీలైనన్ని ఎక్కువ చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. మరోవైపు జాతీయ రహదారులు, సిటీరోడ్లపై వాహనాల డిమాండ్ మేరకు ప్రతి 3కి లో మీటర్లకు ఒకటి చొప్పున చార్జింగ్ స్టేషన్లు ఉండాలి. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు పురోగతి కనిపించడం లేదు. ఇప్పటికిప్పుడు కనీసం 100కేంద్రాలు అవసరం ఉంది.

పెరుగుతున్న ఈవీల వినియోగం..

విద్యుత్ చార్జింగ్ కేంద్రాల కొరత ఉన్నప్పటికీ ఈవీల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో అన్ని రకాల వాహనాలు సుమారు 11 లక్షల వరకు ఉంటే, ఎలక్ట్రిక్ వాహనాలు 6,494 వరకు ఉన్నాయి. వీటిలో 5966 ద్విచక్ర వాహనాలే కావడం గమనార్హం. కార్ల సంఖ్య తక్కువే. కేవలం 218 ఎలక్ట్రిక్ కార్లు ఇప్పటివరకు నమోదయ్యాయి. సుమారు 96కు పైగా ఆటోలు తిరుగుతున్నాయి. ఇవి కాకుండా ఇతర కేటగిరీలకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాలు వందకు పైగా ఉన్నట్లు అంచనా.



తిరుపతి జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాలు..	
ద్విచక్ర వాహనాలు	5,966
కార్లు	218
ఆటోలు	96
ఇతర వాహనాలు	100
మొత్తం వాహనాల సంఖ్య	6,494

ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్య నివారణ...



తిరుపతి జిల్లా పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలతో వాయు, శబ్ద కాలుష్యం నివారించవచ్చు. పెట్రోల్, డీజిల్ వినియోగం వల్ల వాతావరణం వాతావరణం సైతం కాలుష్యంతో నిండిపోయింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ద్వారా కాలుష్యం తగ్గి ప్రజలు ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుండడంతో చార్జింగ్ కేంద్రాలను కూడా పెంచాలి.

– మురళీమోహన్ జిల్లా రవాణాశాఖ అధికారి

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం ఉదయం జరిగిన కల్పవృక్ష వాహన సేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈఓ శ్యామలరావు ఆవిష్కరించారు. ఆచార్య దామోదర నాయుడు రచించిన ఇతిహాసాల్లో మహర్షులు, డాక్టర్ ఎంజీ దేశ్‌పాండే రచించిన తిరుమల తిరుపతి క్షేత్రమహత్య(కన్నడ), ఆచార్య ఐఎస్ చంద్రశేఖర్ రెడ్డి రచించిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కీ జీవని (హిందీ), వావిలికొలను సుబ్బారావు రచించిన హనుమంతుడి చరిత్ర పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి ఆకెళ్ల విభీషణ శర్మ, ఉపసంపాదకులు నరసింహాచార్య, రచయితలు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం

శ్రీహర్షరెడ్డికి ఆశీస్సులు

తిరుపతి మంగళం: తిరుపతి రూరల్‌లోని తనపల్లి రోడ్డులో ఉన్న పీఎల్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మేనల్లుడు శ్రీహర్షరెడ్డి రిసెప్షన్ వేడుకగా జరిగింది. కొత్తజంటను ఆశీర్వదించడానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో పాటు చిత్తూరు ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణ స్వామి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, విజయానందరెడ్డి, భరత్, నూకతోటి రాజేష్ విచ్చేశారు. అతిథులంతా నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి ఈ సందర్భంగా మాటామంతీ కలిపి ముచ్చటించారు.



నూతన దంపతులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పెదిరెడ్డి రామచంద్రారెడ్డి మేనల్లుడు శ్రీహర్షరెడ్డి రిసెప్షన్‌లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు


బంగారు వ్యాపారుల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని బంగారు వ్యాపారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి రాష్ట్ర జ్యువెలరీ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి జయకుమార్ తెలిపారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య సంయుక్త జిల్లాల్లో బంగారు, సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యాపారుల అభ్యున్నతికి ఇటీవల విజయవాడలో గోల్డ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి తద్వారా వ్యాపారుల వ్యాపార దృక్పథంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు పర్యటిస్తూ ఆయా జిల్లాల్లో అసోసియేషన్ నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతో అసోసియేషన్ ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మూడు జిల్లాల అసోసియేషన్ అధ్యక్షుడుగా కేవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా ప్రకాష్ పోకర్ణ చంద్, ఉపాధ్యక్షుడు ఎస్.జితేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నాగరాజు, కార్యదర్శులుగా, సహాయ కార్యదర్శులతో పాటు ఫైనాన్స్ కమిటీ చైర్మన్‌గా పి.షణ్ముగం, డి.కిషోర్‌సింగ్, ఎల్.వంశీకృష్ణ, మదన్‌లాల, మహేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యాపారులంతా సమిష్టిగా రాణిస్తూ అభివృద్ధి పథంలో పయనించేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జ్యువెలరీ అసోసియేషన్ చీఫ్ ఆర్గనైజర్ శాంతిలాల్, మూడు జిల్లాలకు చెందిన బంగారు, స్విలర్ వ్యాపారులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడు సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర నేతలు

'టైం లాండ్' షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: వీవీ మహల్ రోడ్డులో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన టైం లాండ్ వాచ్ షోరూంను అధినేత షేక్ ఇంతియాజ్, ఉస్మాన్ షోయబ్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ ఇంతియాజ్ మాట్లాడుతూ తమ షోరూంలో జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లతో కూడిన అన్ని రకాల కంపెనీ వాచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటులో ఉండే ధరలతో వాచ్‌లు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, మబ్బు దేవనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కపిలేశ్వరాలయంలో ఉత్సవాలు ముగింపు



పుష్కరిణిలో త్రిశూలస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని నెల రోజుల పాటు చేపట్టిన హోమ మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. చివరి రోజు శ్రీచండీకేశ్వరస్వామివారి హోమం వేడుకగా చేపట్టారు. అనంతరం మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహా శాంతి అభిషేకం, కలశాభిషేకం నిర్వహించారు. చివరిగా త్రిశూలస్నానం, అంకుర విసర్జన చేపట్టారు. కాగా సాయంత్రం లక్ష దీపారాధన, పంచమూర్తులైన శ్రీవిఘ్నేశ్వరస్వామి, శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి, శ్రీకపిలేశ్వరస్వామి, శ్రీకామాక్షి అమ్మవారు, చండీకేశ్వరస్వామి వారికి ఆరాధన నిర్వహించారు. అనంతరం పంచమూర్తులు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఇతర అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు జీతాలు పడేనా..!

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఉద్యోగులకు వేతన వెతలు కొనసాగుతూనే ఉన్నాయి. గత రెండు నెలలుగా శాశ్వత, పెన్షన్‌దారులు, తాత్కాలిక ఉద్యోగులు జీతాలు పడక నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సుమారు రూ.44 కోట్లు విడుదలైనా ఇంత వరకు జీతాలు పడకపోవడంతో ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం. డిసెంబర్ నెల మొదలు కావడంతో ఒకటి లేదా రెండో తారీఖున రెండు నెలల జీతాలు పడతాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని ఎన్నికలప్పుడు కూటమి నేతలు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అన్నమాచార్య కళామందిరంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో వివిధ కళా వేదికలపై కళాకారులు ప్రదర్శించిన ఆధ్యాత్మిక, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా మహతి కళాక్షేత్రంలో సాయంత్రం చెన్నైకి చెందిన గాయత్రి వెంకటేష్ గాత్ర కచేరి, శైలజాకుమార్ బృందం కథాకళి నృత్యాభినయం ఆకట్టుకుంది. అనంతరం శంకరి నాట్యశాలకు చెందిన భరద్వాజ కూచిపూడి నాట్యం నయనానందకరంగా సాగింది. అలాగే రామచంద్ర పుష్కరిణి కళా వేదికపై సాయంత్రం వాయునందన్ బ్రదర్స్ బృందం ప్రదర్శించిన భక్తి సంకీర్తనల గానామృతం అలరించింది. తిరుచానూరులోని ఆస్థాన మండపంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కళాకారులు ప్రదర్శించిన హరికథ పారాయణం, భక్తి సంకీర్తనలు భక్తులను రంజింపజేశాయి. శిల్పారామంలో సాయంత్రం కళాకారిణి లక్ష్మీ బృందం ప్రదర్శించిన భరతనాట్యం భక్తులకు కనువిందు చేసింది.



మహతి కళాక్షేత్రంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

రుయాలో ఎయిడ్స్ డే

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రి, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో ఆదివారం ఎయిడ్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడుతూ హెచ్‌ఐవీ సోకినప్పటికీ జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చని తెలిపారు. వ్యాధి సోకిన రోగులు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా ఇచ్చే మందులు వాడాలని సూచించారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ ప్రజలు ఎయిడ్స్ నియంత్రణ పద్ధతులు పాటించి హెచ్‌ఐవీ అరికట్టాలని తెలియజేశారు. అనంతరం ఎయిడ్స్ అవగాహన పోస్టర్లను విడుదల చేసి, ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, జిల్లా నెట్‌వర్క్ ప్రెసిడెంట్ రమేష్, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ రూప్‌కుమార్, సెట్విన్ సీఈఓ మోహన్ కుమార్, ఏఆర్డీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద రావు, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

దేదీప్యం.. పద్మావతి దేవి దర్శనం..





కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారికి మంగళహారతి సమర్పిస్తున్న అర్చకులు, అమ్మవారి వాహన సేవలో టీటీడీ ఈఓ, జేఈఓ దంపతులు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు ఆదివారం అమ్మవారికి కల్పవృక్ష, హనుమంత వాహన సేవలు నిర్వహించారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 10 కళాబృందాలకు చెందిన 238 కళాకారులు సంగీత, నృత్య ప్రదర్శనలతో అలరించారు. తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు పలు అన్నమయ్య సంకీర్తనలకు చక్కటి నృత్య ప్రదర్శన చేశారు. కర్ణాటకకు చెందిన 27 మంది కళాకారులు క్షీరసాగర మథనం, వివిధ పౌరాణిక పాత్రలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.

– చంద్రగిరి(తిరుచానూరు)



గరుత్మంతుడితో శ్రీనివాసుడు, శ్రీపద్మావతి దేవేరుల వేషధారణలో కళాకారులు

ముగ్ధమనోహరం.. సంగీత నీరాజనం



సంగీత కచేరీకి హాజరైన అధికారులు, విద్యార్థులు, సంగీత ప్రియులు



కీర్తనలను ఆలపిస్తున్న గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, బుల్లెమ్మ బృందం

తిరుపతి సిటీ: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని ప్రసంగించారు. కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం తిరుపతిలో నిర్వహించడం సంతోషకరమన్నారు. విద్వాన్ శ్రీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, బుల్లెమ్మ బృందం గాత్ర కచేరీకి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ దివ్య కచేరీలు ఎంతో ప్రాచుర్యం పొందాయని, అన్నమాచార్య కీర్తనలు వీనుల విందుగా శ్రోతలకు అందించారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రొఫెసర్ కాత్యాయని, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ నుంచి రీటా చౌదరి, కేంద్ర ప్రభుత్వ సదరన్ జోన్ టూరిజం ఆర్డీ వెంకటేశన్, ఏపీ టూరిజం ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణ ప్రసాద్, నెల్లూరు మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.